క్లుప్తంగా

26న ఉచిత సామూహిక ఉపనయనాలు

కొవ్వూరు: ఏపీ బ్రాహ్మణ సేవాసంఘం, శ్రీగాయత్రీ లక్ష్మీగణపతి పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక గోష్పాద క్షేత్రంలో ఉచిత సామూహిక ఉపనయనాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు వారణాసి సీతారామ హనుమంతరావు తెలిపారు. ఉదయం 9.47 గంటల నుంచి సుందర గోవిందుడి గోశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు.వివరాలకు 93907 78888, 98497 56120 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భారీ అన్న సమారాధన

పెరవలి: కాకరపర్రులోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారికి వారం రోజులుగా జాతర నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 12 రకాల కూరలు, పిండి వంటలతో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. అన్నదానానికి కాకరపర్రు, వెంకట్రాయపురం, అజ్జరం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల నుంచి సుమారు 10 వేల మంది హాజరయ్యారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి వద్ద ఆదివారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని త్యాజంపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అయినపర్తి చిట్టిబాబు (45)మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం చిట్టిబాబు మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం నుంచి స్వగ్రామం త్యాజంపూడి వెళుతున్నాడు. దేవరపల్లి వద్ద హైవే పై ముందు వెళుతున్న లారీని ఆయన ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

250 మందికి వైద్య సేవలు

నిడదవోలు: స్థానిక నందిన ఫంక్షన్ హాల్లో నిడదవోలు రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నందిన చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు సుమారు 250 మందికి ఆర్థో, ఎమర్జెన్సీ, షుగర్, బీపీ వంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాచర్ల మధుసూదనరావు, నందిన రాధాకృష్ణ, వైద్యులు కొండేపాటి రవీంద్రబాబు, కవిత, కె.చెల్లారావు, కె. రోహిత్, కిషోర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా శంకరుడు



ఉస్సే శంకరుడు

దేవరపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షుడిగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఉస్సే శంకరుడు ఎన్నికయ్యారు. రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జిల్లా కార్యదర్శిగా మనోహర్‌కుమార్



మనోహర్‌కుమార్

నల్లజర్ల: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సీహెచ్‌ఎస్ఎస్ మనోహరకుమార్ ఎంపికయ్యారు. మనోహర్‌కుమార్ గతంలో నల్లజర్ల మండల శాఖ గౌరవాధ్యక్షుడిగాను, ప్రధాన కార్యదర్శిగాను వ్యవహరించారు.

సీజనల్ వ్యాధులతో అవస్థలు

నల్లజర్ల: పలు గ్రామాల ప్రజలు దగ్గు, జలుబు, గొంతునొప్పి, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఇలాంటి లక్షణాలతో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రితో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పలువురు చికిత్స పొందుతున్నారు. మరికొందరు మెడికల్ షాపుల వద్ద మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. వారం రోజులుగా ఇలాంటి రోగుల సంఖ్య పెరుగుతున్నట్టు సమాచారం. వాతావరణ మార్పులు, పొగమంచు, రాత్రిపూట చలి, పగలు కాస్త ఎండగా ఉండడం వంటి పరిస్థితులు ఇందుకు కారణమని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు వెల్లడించారు. సంక్రాంతికి ప్రజలు బయట ఎక్కువగా తిరగడం , మంచు, చలి కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన వివరించారు. చాలామంది దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం అంటూ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం కోవిడ్ లేకున్నా ఉన్నప్పుడు మనం పాటించిన జాగ్రత్తలనే ఇప్పుడు కూడా పాటిస్తే ఇలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. గొంతునొప్పి ఉన్నవారు గోరువెచ్చని నీరు తాగాలని, జలుబు ఉన్నవారు ఆవిరి పట్టాలని, బయటకు వెళ్లేటపుడు మాస్క్ ధరించాలని సూచించారు. కేవలం వైరల్ ఫీవర్లు మాత్రమే ఉన్నాయన్నారు.

అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు

- మధ్యవర్తుల ప్రమేయం అవసరం లేదు
- హోం మంత్రి తానేటి వనిత
- దారవరంలో గడప గడపకూ..



దారవరంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో ఆదివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ మూడున్నరేళ్ల జగన్ పాలనలో ఏయే పథకాలు అందాయో ప్రతి కుటుంబాన్ని ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. కార్డుదారుల ఇంటి వద్దకే రేషన్ బియ్యం వస్తున్నాయన్నారు. పేదింటి పిల్లల చదువుల కోసం అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అలాగే ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తీసుకొచ్చామని తెలిపారు. అన్ని వర్గాలకూ మేలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, నాయకుడు లకంసాని సూర్యప్రకాశరావు, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు ఉబా భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు కడప,అనంతపురం జిల్లా జట్లు

- ముగిసిన స్కూల్ గేమ్స్ అండర్–14 ఫుట్‌బాల్ టోర్నీ
- తెలికిచర్లలో బహుమతుల ప్రదానం



ఫుట్‌బాల్ పోటీల బాలుర విభాగం విజేత వైఎస్సార్ కడప జిల్లా జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం



మొదటి స్థానం గెలుచుకున్న అనంతపురం బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నల్లజర్ల: విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయిలో ప్రభుత్వం స్కూల్ గేమ్స్ నిర్వహిస్తోందని పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఆర్. వెంకటరమణ అన్నారు. మండలంలోని తెలికిచర్ల వద్ద గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్), భారతీయ విద్యాభవన్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్ జిల్లాల 66వ స్కూల్ గేమ్స్ అండర్–14 ఫుట్ బాల్ టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపికలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన 13 జిల్లాల నుంచి వచ్చిన 520 మంది క్రీడాకారులకు, కోచ్‌లకు, మేనేజర్లకు మూడు రోజుల పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భారతీయ విద్యాభవన్స్ యాజమాన్యాలను అభినందించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్,భారతీయ విద్యాభవన్స్ ప్రిన్సిపాల్స్ కల్పనాసింగ్, రాజీవ్‌శర్మ, డైరక్టర్ మణికుమార్, గ్రంధి ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.జాన్సన్, టెక్నికల్ కన్వీనర్ ఎస్.భాస్కర్, పరిశీలకుడు ఎంఎస్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేతలు

బాలుర విభాగం	బాలికల విభాగం
మొదటిస్థానం: వైఎస్సార్ కడప జిల్లా	మొదటి స్థానం: అనంతపురం జిల్లా
రెండో స్థానం: అనంతపురం జిల్లా	రెండోస్థానం: ప్రకాశం జిల్లా
మూడో స్థానం: శ్రీకాకుళం జిల్లా	మూడో స్థానం: కడప జిల్లా
నాల్గోస్థానం: నెల్లూరు జిల్లా	నాలుగో స్థానం: కర్నూలు జిల్లా

ముగిసిన కోరుపల్లెమ్మ జాతర



కోరుపల్లెమ్మ తల్లి



సింగమ్మ తల్లి



కోరుపల్లెమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుపల్లి గ్రామ దేవతైన కోరుపల్లెమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గ్రామం నడివీధిలో కొలువైన ఆలయం వద్ద అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వారందరూ అమ్మవారికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళలాడింది. నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై షేక్ సుభానీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, యాళ్ల రామారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటితో ముగుస్తున్న సింగమ్మ వారి ఉత్సవాలు

దేవరపల్లి: మండలంలోని సూర్యనారాయణపురం గ్రామ పొలాల మధ్య కొలువైన సింగమ్మతల్లి ఉత్సవాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు సోమవారం ముగుస్తాయని ఆలయ నిర్వాహకుడు పుట్టా బాల సుబ్రహ్మణ్యం (నాని) తెలిపారు. రోజూ అమ్మవారికి అభిషేకాలు, చండీహోమం, కుంకుమార్చన, విశేష అలంకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

కానిస్టేబుల్ రాత పరీక్షకు 453 మంది హాజరు




ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థుల తనిఖీలు

కొవ్వూరు: కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది.ఈ పరీక్ష కేంద్రానికి 500 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 453 మంది మాత్రమే హాజరయ్యారు. 47 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ దయాకర్ తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ పరీక్ష నిర్వహించారు. కళాశాలలో 21 రూములు ఈ పరీక్షలకు వినియోగించారు.డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పోలీసులు అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్, ఎస్సై బి.దుర్గాప్రసాద్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పరీక్షల అనంతరం ప్రశ్నా పత్రాలను రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్సిటీకి తరలించినట్టు దయాకర్ తెలిపారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్ష సజావుగా సాగింది. స్థానిక ఏకేఆర్జీ ఇంజినీరింగ్ కళాశాల్లో 600 మందికి 477 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి పర్యవేక్షించారు.ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాల్లో 600 మందికి 509 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.ఇక్కడ రాత పరీక్షను దేవరపల్లి సీఐ ఏ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ రెండు కేంద్రాలకూ కొవ్వూరు డీఎస్పీ వర్మ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.నిర్ణీత సమయానికంటే గంట ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు.

సాయినాథుని ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గోష్పాద క్షేత్రంలోని షిర్డీ సాయినాథుడు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని షిర్డీ సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం 28వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం కలశస్థాపన, భక్తులచే సామూహిక సాయి సచ్చరిత పారాయణ నిర్వహించారు. వందలాది భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం వేదిక ఏర్పాటు చేశారు. సాయినాథుడ్ని పూలతో సుందరంగా అలంకరించారు. గురుశిష్య సంబంధంపై మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. అనంతరం కొక్కొండ సూర్య సుబ్రహ్మణ్యం బృందం వీణ కచేరీ చేశారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి రమా సత్యనారాయణ స్వామివారి సామూహిక వ్రతాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రాయితీపై ఎరువుల పంపిణీ

నిడదవోలు రూరల్: రబీలో ఎరువుల కొరత రాకుండా సకాలంలో రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. మండలంలోని శంకరాపురం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై ఎరువుల బస్తాలను ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఆదేశాలతో యూరియాతో పాటు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచామని ఆయన చెప్పారు. సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

పిల్లల మనోవికాసానికి బాధ్యత వహించాలి



వివేకానంద జయంతి వేడుకల్లో బాలికల భరతనాట్య ప్రదర్శన

పెరవలి: పిల్లల మనో వికాసానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని రామకృష్ణ సేవాసమితి ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ పేర్కొన్నారు. రామకృష్ణా సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని కానూరులో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ ప్రసాద్ మాట్లాడుతూ యువత, చిన్నారుల మనోవికాసమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అప్పుడే యువత ఉన్నత స్థితికి చేరుకుంటారని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సమాజం పట్ల విద్యార్థులు ఎలా మెలగాలి అనే అంశాన్ని వివరిస్తూ ప్రదర్శించిన కళారూపం ఆకట్టుకుంది. దీంతో పాటు బాలికలు ప్రదర్శించిన భరత నాట్యం ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో వివేకానంద ప్రచార పరిషత్ కన్వీనర్ అమిరపు నటరాజన్, రామకృష్ణ సేవా సమితి తిరుపతి, రాజమహేంద్రవరం కన్వీనర్లు గంగవరపు శ్రీదేవి, తరఘ వీరానంద మహరాజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోపాలపురంలో స్కిల్ హబ్

గోపాలపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తామని, నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, కస్టమర్ రిలేషన్‌షిప్, నాన్ వాయిస్ కోర్సులలో ఇక్కడ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరడానికి ఇంటర్ పాస్, ఆపై చదివిన 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు వారు అర్హులన్నారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యరర్థులు 84999 43366 అనే నంబర్‌కు సంప్రదించాలన్నారు.

వేలివెన్నులో హోమాలు, పూజలు

ఉండ్రాజవరం: మండలంలో వేలివెన్ను సూర్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారికి గోత్ర నామాలతో పూజలు చేశారు.స్వామి వారికి భక్తులు అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు ఐదు రోజుల నుంచి కోటి విష్ణు సహస్ర నామ పారాయణ పఠించారు. కార్యక్రమాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉమా చోడేశ్వరుని ఆలయంలో హోమం



కొవ్వూరు ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా రాజమహేంద్రవరం వాసులు చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్య శైలజ దంపతుల ఆధ్వర్యంలో రుద్రహోమం, రుద్రాభిషేకాలు జరిగాయి. సూక్త విధానంలో అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కౌతవరపు భాను పూజలను పర్యవేక్షించారు.చిరవూరి సోమయాజులు, చిరవూరి భాస్కరం, వైవీవీ సత్యనారాయణ మూర్తి, బాలప్ప ప్రసాద్, బాలప్ప రుగ్మాంగధరావు, గంగాధర శ్రీరామచంద్రమూర్తి, వాజ్‌పేయిల స్వూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మాఘమాసం సందర్భంగా సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వస్వామి ఆలయంలోనూ విశేష పూజలు నిర్వహించి, సూర్య నమస్కారాలు చేశారు.

స్వల్పంగా పెరిగిన నిమ్మకాయల ధర



నల్లజర్ల మార్కెట్‌కు చేరిన నిమ్మకాయలు

నల్లజర్ల: నిమ్మకాయల ధరలు వారం రోజులుగా ఆశాజనకంగా ఉన్నాయి. ఇంతవరకూ లూజు బస్తా ధర రూ.800 ఉండేది. ఇప్పుడది రూ.1500కు పెరిగింది. ధర పెరిగినా రైతుల తోటల్లో పెద్దగా నిమ్మకాయలు లేవు. విస్తారంగా మంచు కురుస్తుండడం వల్ల ఈశాన్య రాష్ట్రాలకు, విపరీతమైన చలి కారణంగా ఢిల్లీ మార్కెట్‌కు కొద్ది రోజులుగా నిమ్మకాయల ఎగుమతులను నిలిపి వేసినట్టు నల్లజర్లలోని మార్కెట్ నిర్వాహకుడు ఓంకార రాము తెలిపారు. ఇటీవల కోల్‌కతా, బిహార్, రాంచీ తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. వర్షాలకు ముందు దిగిన నిమ్మ కాపు అంతా అయిపోవడంతో కొత్తవి రావడం తగ్గింది. దీంతో కాయలకు గిరాకీ పెరిగింది. రేటు తక్కువగా ఉన్నపుడు ఇక్కడి నిమ్మకాయలను ఊరగాయ తయారీ కోసం కేరళకు తరలించారు. ఫిబ్రవరి నుంచి నిమ్మకాయలకు గిరాకీ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

నాణ్యతే గీటురాయి

నాణ్యమైన నిమ్మకాయలకు మార్కెట్‌లో ధర ఉంటుంది. వర్షాల వల్ల చెట్లకు క్యాంకర్, మంగు తెగుళ్లు సోకడంతో కాయలు కొంతమేర నాణ్యత కోల్పోతున్నాయి. ఈ కారణంగా దూర ప్రాంతాలకు తరలించడం వీలు కావడం లేదు. ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి చేయాలంటే కనీసం మూడు రోజుల పైనే పడుతుంది. ఆలోపు నాణ్యత దెబ్బతింటుంది. ఈ కారణంగానే రైతులకు ఆశించిన ధర రావడం లేదు. శీతాకాలంలో ఈ ప్రాంత నిమ్మ తోటలకు వచ్చే తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పాలిథిన్ షీట్లు కప్పి సాగు నీటి ఆదా



ముక్కామల వద్ద మడిలో నీరు బయటకు వెళ్లకుండా గట్టుపై ఏర్పాటు చేసిన పాలిథిన్ షీట్

- దాళ్వాకు నీటి ఎద్దడి రాకుండా రైతుల సరికొత్త జాగ్రత్తలు

పెరవలి: ఏటా దాళ్వా వరి సాగుకు నీటి ఎద్దడి రావడం సహజం. సాధారణంగా పంట చివరి దశలో ఉండగా రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటారు. ఇలాంటి పరిస్థితిని నివారించేందుకు, పొలంలోని నీటిని బయటకు పోకుండా రైతులు ఇప్పటి నుంచే సరికొత్త జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాళ్వా వరి పొలం చుట్టూ ఉండే గట్లకు పూర్తిగా పాలిథిన్ షీట్లు కప్పుతున్నారు. దీనివల్ల మడిలోని నీరు పక్క మడిలోకి గాని, దిగువకు గాని పోయే అవకాశం ఉండదు. అంతేగాకుండా ఇలాంటి ఏర్పాటు చేసిన పంటకు నీరు పెడితే పది రోజుల వరకూ నీటి తడి అందించకపోయినా ఎలాంటి ఇబ్బందీ ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమైనా, పెట్టుబడి ఎక్కువైనా పంటకు నీటి ఎద్దడి రాకుండా ఈ పాట్లు తప్పడం లేదని రైతులు వివరిస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో రైతులు 35,500 ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు. ఇప్పటికే పెరవలి మండలంలోని కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో నీటి ఎద్దడి వలన అధికారులు, రైతులు మురుగు, పంట కాలువల్లో నీటిని అడ్డుకట్టలు వేసి నిల్వ చేస్తున్నారు. దాళ్వా పంటకు ఇబ్బంది లేకుండా నీటి అందిస్తామని అధికారులు భరోసా ఇవ్వడంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. మరోపక్క మెట్ట పొలాలకు నీరు అందడం లేదంటూ రైతులు తరచూ అధికారులను అడుగుతున్నారు. 'మేం ఏం చెయ్యగలం. వచ్చిన నీటిని అన్ని కాలువలకూ సక్రమంగా పంపిణీ చేస్తున్నాం' అంటూ అధికారులు సర్ది చెబుతున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా

అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు



గోపాలపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానంటూ రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రేగులగుంటలోని తన స్వగ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 56 ఉప కులాలతో అతిరాస కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆ సంస్థకు రెండోసారి కూడా తనను చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభినందనలు

అతిరాస కార్పొరేషన్ చైర్మన్‌గా రెండోసారి నియమితులైన ఇళ్ల భాస్కరరావుకు గోపాలపురం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం అభినందనలు తెలిపాయి. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు ఎస్‌కే ఖాదర్ వలీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కూసం రామమోహన్‌రెడ్డి అభినందించిన వారిలో ఉన్నారు.